రచన ఇంటింటి పత్రిక, అక్టోబర్ 2008

# రోగం

రాత్రి పది దాటింది.

సుమిత్రా, సుధాకర్ వాళ్ల గదిలో సూట్‌కేసులు సర్దుకుంటున్నారు.

ఇవ్వాళ వాళ్ళ అమెరికా ప్రయాణం.

హాల్లో వో పక్కగా వున్న మంచం మీద పడుకుని వున్నాడు నారాయణ. నైరాశ్యంగా సీలింగ్ కేసి చూస్తున్నాడు. ఉండుండి ఓసారి 'హే రామ్' అంటూ గట్టిగా ఊపిరి తీసుకుంటున్నాడు. వణికే వేళ్లతో మంచం అంచు మీద చెయ్యి ఆనించి ఆపసోపాలు పడుతూ ఉండటం ఈమధ్య అలవాటయింది. ఇప్పుడూ అదే భంగిమలో, అదే చర్యలో ఉన్నాడు. ఆయన కళ్లల్లో దుఃఖపు చినుకులు. ఏ క్షణాన్నయినా వర్షించేటట్లు నిలిచి ఉన్నై. ఆయన మనస్సు మూలుగుతోంది. పెదవులు కదులుతున్నాయి. 'వచ్చారు, వెళ్తున్నారు' అనుకుంది ఆయన 'మనసు. మాటలు పైకి రాలేదు.

అదే హాల్లో ముఖద్వారం పక్కగా స్టూలు మీద గోడ కానుకుని కూర్చుని ఉన్నాడు వెంకటేశ్వర్లు. నారాయణ తమ్ముడు.

వంటమనిషి సుభద్రమ్మ వంటింటి గుమ్మం పక్కగా నడుం వాల్చింది.

సుధాకర్ హాల్లోకొచ్చాడు. అతని వెనగ్గా భార్య సుమిత్ర వచ్చింది. నారాయణ ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చున్నాడు.

హాలు నిశ్శబ్దంగా వుంది. వాతావరణం మూఢంగా వుంది. మనుషులు మౌనంగా ఉన్నారు. గాలి కూడా స్తంభించింది. సుధాకర్ లేచి వెళ్ళి కిటికీ తెరిచాడు. దక్షిణపు గాలి వీచింది. వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

నిముషాలు గడుస్తున్నై.

సుధాకర్‌నీ, సుమిత్రనీ ఉద్దేశించి మొదలెట్టాడు వెంకటేశ్వర్లు.

"మీ మానా  మీరిట్టా వెళ్ళిపోతా ఎట్టాగురా? కొడుకూ, కోడలూ అన్న బాధ్యతని ఫీల్ కాకుండా, యన్నలా మంచంలో వదిలేసిపోతే, ఎవరికి పడుతుందీ లంపటమంతా?"

భార్యాభర్తలు మొహమొహాలు చూసుకున్నారు. వకీలుగా ప్రాక్టీసు చేసి మానేశాడు వెంకటేశ్వర్లు. ఆయనతో తలపడటం కష్టం.

"చూశారుగా ఆయన పరిస్థితి. మనం కదిలిస్తే కదులుతాయి అవయవాలు. ఎక్కడ పెడితే అక్కడుంటాయి. కాలకృత్యాలన్నీ ఆ మంచంలోనే. అన్నం కలిపి ముద్ద నోట్లో పెట్టాలి. ద్రవం ఏదైనా పట్టుకుని గొంతులో పొయ్యాలి. మీరూ మాట్లాడారు గదా డాక్టరుతో. మాట కూడా సరిగా రావటం లేదు. ఈ వారంలో పరిస్థితి ఇంకా దిగజారింది. ఒక మగమనిషి ఆయన్ని అంటిపెట్టుకుని ఉండాల్సిందే. ఇంటిపనికీ, వంటపనికీ, ఒక ఆడమనిషి ఎటూ తప్పదు."

తల వంచుకుని బాబాయి చెప్పేది వింటున్న సుధాకర్ తలెత్తి తండ్రి కేసి చూశాడు. ఆయన అప్పటికెప్పుడో మూగగా రోదిస్తున్నట్టున్నాడు – తలగడ కన్నీటితో తడిసి వుంది. సుమిత్రా చూసింది.

సుధాకర్ లేచి తండ్రి మంచం దాకా నడిచి, ఆయన టవల్ తీసి కళ్ళు తుడిచాడు. నారాయణకి దుఃఖం ఆగలేదు. కన్నీరు జలజల రాలింది. సుధాకర్ గుండె బరువెక్కింది. మంచం పట్టె మీద కూర్చున్నాడు.

వెంకటేశ్వర్లు తన మాటలు కొనసాగించాడు.

"ఆ సుభద్రమ్మేమో కూతురింటికి విజయవాడ పోవాలని చెప్పుల్లో కాళ్లు పెట్టుక్కూచుంది. బలవంతాన ఈ పది రోజులూ ఉంచాను. చూశారుగా - ఆ మల్లేశమేమో మీరొచ్చిన మర్నాడేగా 'నావల్ల కాద'ని వెళ్లిపోయాడు. నేనుగా ఆయన్ని ఎంతని మేనేజ్ చేయగలను? ఆయన దెబ్బె నాలుగు, నేను దెబ్బె. చెప్పుకునేది కాదు - నా అవస్థ. మా పిల్లలూ, మీ పిన్నీ మాట్లాడే మాటలకి చచ్చే చావుగా వుంది నాకు. మనసు మనసులో ఉండదు. పగలూ రేయీ అన్నయ్య ఆలోచనే. ఈ బస్సుల్లో పడి తిరగ్గలనా? తెల్లవారితే ఏమిటి పరిస్థితి? ఎవరు చేస్తారు? ఈ ఆలోచనే నా బుర్ర తినేస్తోంది."

ఫోన్ మ్రోగింది.

వెళ్లి చూశాడు సుధాకర్. విన్నాడు. రిసీవర్ పెట్టేసి, పైకే చెప్పాడు.

"ఉదయం నేను కనుక్కున్న ఓల్డ్ ఏజ్ హోమ్ వాళ్లు. అన్నీ ఆలోచించి నిర్ణయం తీసుకున్నారట. ఇలా 'టోటల్లీ ఇన్‌వాలిడ్' వాళ్లని వాళ్లు చూసుకోలేమంటున్నారు."

"అదేగా నే మొత్తుకునేది. నేనూ ఈ హైదరాబాద్‌లో అన్ని విచారణలూ చేశాను. 'మల్టిపుల్ స్క్లెరోసిస్ కేసయితే కష్టం సార్' అనే సమాధానం."

రగులుతున్న ఆలోచనల అసహనంతో స్టూలు మీద నుంచీ లేచి హాల్లో నిమ్మళంగా అటూ ఇటూ పచార్లు చేయసాగాడు వెంకటేశ్వర్లు.

"మీ ఇబ్బందులూ, ఈ సమస్యా అన్నీ తెలుస్తూనే ఉన్నయ్ మామయ్యాగారూ, కానీ...." అని మాట కలిపింది సుమిత్ర.

మనస్సు చివుక్కుమందో, మెత్తపడిందో తెలియనివ్వని కంఠస్వరంతో అన్నాడు వెంకటేశ్వర్లు - "నాకు తెలుసు. మీ పనులూ, సమస్యలూ మీవి. కానీ పరిస్థితి ఎంత భయానకంగా వుందో మీకు మీరుగా ఆలోచించుకోండి" అని ఒక్క క్షణం ఆగి, "అసలు భయంకరమైన విషయం చెప్తా వినండి. ఒంటరిగా ఇంట్లో ఆయనో దుంగలా అలా పడి వుంటే, ఏ క్షణాన్న ఎవడికేం దుర్బుద్ధి పుడుతుందో అని నా భయం. చుట్టూరా కమర్షియల్ కాంప్లెక్స్‌లు. జనం అబ్జర్వ్ చేస్తూ ఉంటారు కదా. పక్క పోర్షన్‌లో అద్దెవాళ్లు - ఆ రఘునాథం, సుశీలా వాళ్లయినా ఇరవై నాలుగ్గంటలూ ఈ యింటికి కాపలా కాయలేరు కదా? ఆలోచించండి. తలచుకుంటే గుండె తల్లడిల్లుతుంది నాకైతే. చెక్కు మీద సంతకం చేయటం కూడా పోయింది. నాతో జాయింట్ అకౌంట్‌లున్నై కనుక పని గడుస్తోంది."

వెంకటేశ్వర్లు చివరి మాటలకి భర్త మనోభావాల్ని చదువుకోవాలనే ప్రయత్నం చేస్తూ, సుధాకర్ కళ్లల్లోకి చూసింది సుమిత్ర. అతను చూపులు మరల్చుకుని బాబాయి వైపే చూస్తూ వుండిపోయాడు.

"నే పెట్టే ఘోష ఏమిటంటే, ఈ పరిస్థితుల్లో తండ్రి కోసం మీరు కొన్ని సుఖాలు వదులుకోక తప్పదు. అంటే అన్నానంటారు గానీ.... మీరు సరే, కనీసం వచ్చి చూసి వెళ్తున్నారు. వాడేడీ, అదే - ఆ రెండోవాడు - మాధవ. అమ్మ పోయినప్పుడు వచ్చి వెళ్లారు. రెండేళ్లయింది. మొగుడూ పెళ్లాలకి అమెరికాయే వైకుంఠం, కైలాసం! తండ్రికింత ఘోరం జరిగినా వాడికీ, వాడి పెళ్లానికీ చీమ కుట్టినట్టు లేదు."

ఆయనీ మాటలంటుండగా కరెంటు పోయింది. నారాయణ మంచంలో తల వెంపున ఉన్న టార్చ్ తీసి, వెలిగించాడు వెంకటేశ్వర్లు. సుభద్రమ్మ కొవ్వొత్తులు వెలిగించి తెచ్చింది.

"ఇదే ఉదాహరణ. ఆమధ్య ఒక రోజున సుభద్రమ్మ ఏదో షాపుకి పోయిందట. ఇంట్లో కరెంటు పోయింది. ఫోన్ మోగటం మొదలయితే, పక్క స్టూల్‌ని అందుకోవాలని ప్రయత్నించాడు. మంచం మీద నుంచి కిందకి దొర్లటం, చెయ్యి మణికట్టు దగ్గర ఫ్రాక్చర్. అదో కథ. చెప్పాను కదా, మొన్న. ఎముకలన్నీ పెళుసయిపోతాయిట. పడితే చాలా కష్టం."

ఎవరి ఆలోచనల్లో వాళ్ళుండిపోయారు.

నిముషాలు గడిచాయి. కరెంట్ వచ్చింది.

బాబాయికి చెప్పగలిగే మాటలేవీ సుధాకర్ దగ్గర లేవు.

కానీ, ఆయన చెప్పిన మాటలు తలచుకుంటుంటే, గుండెలు జారుతున్నై. ఎక్కడో పాతాళంలో పడుతున్న భావన కలుగుతోంది.

"సరే టైమవుతోంది" అంటూ లేచి వంటింట్లోకి నడిచింది, సుమిత్ర. ఆమె వెనగ్గా సుధాకర్ కూడా కదిలాడు.

నారాయణ, వెంకటేశ్వర్లు టిఫిన్‌లు ఎనిమిదిన్నరకే అయినై. ఆ తర్వాత సుభద్రమ్మా కానిచ్చింది. లేట్‌గా తినటమే ఈ దంపతులకి అలవాటు.

భోజనం చేస్తున్నాడన్న మాటేగానీ, తన ఆలోచనలో తానున్నాడు సుధాకర్.

ఇటీవల జరిగిన సంఘటన స్ఫురణకి కొచ్చిందతనికి.

ఒకరోజు రాత్రి -

తండ్రి పరిస్థితంతా కళ్లకు కట్టినట్టు ఫోన్‌లో మాధవకు చెప్పాడు. బోస్టన్‌లోనే ఉన్నాడు మాధవ. విన్నాడు. కడకొక మాటన్నాడు - "ఇట్లాంటి పేషంట్స్ జీవచ్ఛవాల్లా చాలా ఏళ్లు బతుకుతారు. కానీ చూద్దాం. ఇండియా గిండియా అంటే నే చావలేను. మా కిక్కడ చాలా కమిట్‌మెంట్స్ ఉన్నై. అందులో మొదటిది ఇల్లు" అని, "ఆస్థి సంగతి ఎంక్వైరీ చెయ్యి. ఏమంటాడో" అన్నాడు.

తనకెందుకో మనసంతా వికలమయింది. సుమిత్రతోనూ అదే మాటంటే, ఆమె "అవును, అతను కరెక్ట్. ఉన్నట్టుండి ఏమైనా అయితే.... కీడెంచి మేలెంచమన్నారు" అని మాటిల్ని ఛెళ్లుమనిపించింది. విస్తుపోవటం తన వంతయింది!

- సామాను బయట పెట్టుకునేసరికీ టాక్సీ వచ్చేసింది.

"వస్తాం నాన్నా" అని కొడుకూ, "వెళ్లొస్తాం మామయ్యా" అని కోడలూ సెలవు తీసుకున్నారు.

నారాయణ కనుకొలకుల్లోని నీటి బిందువుల్ని ఆ దంపతులు గమనించలేదేమో గానీ, వెంకటేశ్వర్లు గమనించాడు. ఆయన గుండె చప్పుడు ఈయన చెవుల్ని తాకుతూనే వుంది.

రఘునాథం, సుశీలా గుమ్మం బయటకొచ్చారు.

వాళ్లతో అన్నాడు సుధాకర్ - "మీరే కాస్త కనిపెట్టి ఉండాలి. వెళ్లొస్తాం" అని.

సుమిత్రా సెలవు తీసుకుంది. వాళ్లేమీ సమాధానం చెప్పకుండా చూస్తూ ఉండిపోయారు.

వెంకటేశ్వర్లూ, సుభద్రమ్మా గుమ్మంలో నిలబడ్డారు.

"పెద్దవాడవి, నేనుగా ఏం చెప్పగలను బాబాయ్" అని మాత్రం అని టాక్సీ ఎక్కేశాడు సుధాకర్. సుమిత్రా ఎక్కింది.

టాక్సీ కదిలి ముందుకు వెళ్లింది.

ఇంట్లో వారు మిగిలేరు! అన్నా, తమ్ముడూ, సుభద్రమ్మా

- తెల్లవారుతూనే,

నారాయణ వెంకటేశ్వర్లుతో అన్నాడు – "వెంకమ్మతో మాట్లాడు. గతంలో రెండు మూడుసార్లు సహాయం చేసింది కదా. ఖాళీగా వుందేమో కనుక్కుని రిక్వెస్ట్ చేస్తే సరి" అని.

ఆమెకు ఫోన్ చేస్తే, "లగ్గసరి. చాలా పనుల ఒత్తిడిగా ఉంది, రోజుకు అరొందలు పోతా"యని నసిగింది.

"నీకేమీ నష్టం కలిగించములే రావమ్మా" అని బ్రతిమిలాడితే సరేనన్నది. ఆ 'సరే'కి చాలా నిబంధనలు పెట్టింది. 'రాత్రిళ్ళు ప్రత్యేకం వండలేననీ.... మనుషులు ఎక్కువమంది వస్తే, ఎక్కువివ్వాలనీ.....' ఇలా.

ఆ మధ్యాహ్నమే సుభద్రమ్మ విజయవాడ వెళ్లిపోయింది.

+ + +

ఆదివారం. మధ్యాహ్నం రెండయింది.

ఎండ నిప్పులు చెరుగుతోంది.

నారాయణ మంచంలో అస్థిమితంగా సమయాన్ని ఉసురుసురుతో గడుపుతున్నాడు. వెంకమ్మ వంటింట్లో కునుకు తీస్తోంది. వెంకటేశ్వర్లూ పడుకుని విశ్రాంతి తీసుకుంటున్నాడు.

ఆ వేళప్పుడు ఎండనబడి వచ్చారు రామయ్య, యాదమ్మ. పక్క పోర్షన్‌లోకి వెళ్లారు. పదేళ్లనుంచీ ఈ ఇంటికి వాళ్లు పాతకాపులే. పాత గుడ్డలు తీసుకుని స్టీలు సామాన్లు అమ్ముతారు. నారాయణ భార్య ఆదిలక్ష్మి ఉన్నపుడు వస్తూ వుండేవాళ్లు. ఇప్పటికీ ఈ ప్రాంతానికి వస్తే పలకరించి వెళ్తారు.

– సుశీలా, ఆమె వెనగ్గా రామయ్యా, యాదమ్మా–నారాయణా వాళ్ల వాటాలోకి వచ్చారు.

గోడవారగా నేల మీద కూర్చున్నారు. మంచినీళ్లు త్రాగేరు.

రామయ్య – వ్యాపారం గురించీ, సాధక బాధకాలూ చెప్పుకొచ్చాడు. అవసరాలు పెరగటం, ధరలు మండిపోవటం, ఈతిబాధలూ చెప్పుకుంది యాదమ్మ. "అన్ని కాలాల్లోనూ ఈ ఎక్కే గడపా, దిగే గడపా అవస్థ. ప్రాణం తీస్తోంది" అని వాపోయారు.

ఉన్నట్టుండి సుశీల చొరవ తీసుకుని నారాయణకి మనిషి సాయం ఎంత అవసరమో చెప్పుకొచ్చింది.

చాలాసేపు మాటలు సాగినై. వెంకటేశ్వర్లు తన సలహా తాను చెప్పాడు. వెంకమ్మ చేత చాయ్ ఇప్పించాడు నారాయణ. తాగి వెళ్లారు.

తమ వాటాలోకి వెళ్తూ వెళ్తూ సుశీల అన్నది – "వాళ్లిద్దరికీ ఈ ఏర్పాటు పెద్ద ఉపకారం బాబాయ్‌గారూ. ఇల్లిల్లూ తిరిగే అవసరం లేకుండా నీడ పట్టున పనిచేసుకుంటూ, ఇదివరకటి కంటే నాలుగు రాళ్లు ఎక్కువే సంపాదించుకునే అవకాశం కలిగింది" అని.

నారాయణ నిర్వేదంగా ఎదురుగా వున్న వాల్‌ప్లేట్‌ని చూశాడు. ఏటి వొడ్డున ఇసుకలో నిలిచిన నావ!

– ఆ రాత్రి.

మాధవ ఫోన్ చేశాడు. బహుశా సుధాకర్ మాట్లాడి వుంటాడు అనుకున్నాడు నారాయణ. వెంకటేశ్వర్లు ఉన్నాడు. వెంకమ్మ లేదు. విషయాలు విచారించాడు మాధవ. అతను మాట్లాడుతుండగా స్పీకర్ ఆన్ చేశాడు వెంకటేశ్వర్లు.

ఇవ్వాల్టి పరిణామం చెప్పాడు వెంకటేశ్వర్లు.

అంతా విని, "ఇద్దరికీ కలిపి నెలకెంత?" అన్నాడు మాధవ.

చెప్పాడు వెంకటేశ్వర్లు. అదిరిపడ్డట్టు ఠక్కున అన్నాడు – 'ఎనిమిది వేలా? ఎనిమిది వేలే!" మాటలు ఆశ్చర్యాన్ని దొర్లించినై.

పక్కనుంచీ మాధవ భార్య చాలా ఆత్రుతతో అడిగింది – "అది సరే మామయ్య గారూ. ఇంతకీ వాళ్లదే కులమో ఏమిటో కనుక్కున్నారా? మనవాళ్లేనా? మీరు చెప్పే దాన్ని బట్టి చూస్తే చిల్లర మనుషులేమో అని డౌటొస్తుంది."

ఫోన్ సంభాషణ ముగిసింది. నారాయణకి కసీ, కోపం ఉవ్వెత్తున లేచాయి.

వెంకటేశ్వర్లు ఠక్కున తారాస్థాయిలో అన్నాడు – "వాడేమో రామయ్యా,యాదమ్మా చేయబోయే సహాయంలో వ్యాపార సంబంధాన్ని చూస్తున్నాడు. ఈవిడేమో – తన చెల్లెలు ఇంగ్లీష్ వాణ్ణి చేసుకున్నా ఆమోదించిన అభ్యుదయవాది – ఇక్కడ కులప్రసక్తి తెస్తోంది. ఇంతలో వుంది మానవసంబంధాల విలువ! వీళ్ల మనసులన్నీ ఇరుకూ, మురికీ!"

నారాయణ అతికష్టం మీద హీనస్వరంతో అన్నాడు – "జెర్ ఇన్‌సాన్ మర్‌గయా – తమ్ముడూ" అని!!!

(రచన– కథాపీఠం పురస్కారం)